సాక్షి సంగారెడ్డి

బుధవారం । 23 । ఏప్రిల్ । 2025



కష్టాల కడలిలో...

భర్త దూరం అయ్యాడు.. పుట్టినిల్లు. మెట్టినింటి వారు ఆర్థికంగా లేరు. ఒక్కగా నొక్క కూతురు చదువు కోసం కష్టపడాలి.

వివరాలు 10లో ▸



ఈతకు వెళ్లి యువకుడు మృతి

ఈతకు వెళ్లి యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని చీకోడ్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది.

వివరాలు 10లో ▸



మోకాళ్లపై ప్రొఫెసర్ల నిరసన

సుల్తాన్పూర్ జేఎన్టీయూలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు మంగళవారం మోకాళ్లపై నిరసన దీక్ష చేపట్టారు.

వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

ఇంటర్‌లో గురుకులాల జయకేతనం

పటాన్‌చెరు టౌన్: ఇంటర్మీడియెట్ పరీక్షల ఫలితాల్లో ఇస్నాపూర్, చిట్కుల్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. పటాన్ చెరు మండలం చిట్కుల్, ఇస్నాపూర్ గురుకుల కళాశాలలో ఎంపీసీ, బైపీసీ విద్యార్థుల పరీక్ష ఫలితాలు మంగళవారం వచ్చాయి. ఇస్నాపూర్ ఇంటర్ ప్రథమ ఏడాదిలో 91% విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. రెండో ఏడాదిలో 99% ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరం లో 77 మంది పరీక్షలు రాయగా వారిలో 72 మంది ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్‌లో 80 మంది పరీక్ష రాస్తే వారిలో 73 మంది ఉత్తీర్ణులయ్యారు. అదేవిధంగా చిట్కుల్‌లో మొదటి సంవత్సరం పరీక్షల్లో 99%, సెకండియర్‌లో 98% ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 74 మంది పరీక్షకు హాజరు కాగా వారిలో 73 మంది ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్‌లో 78 మంది పరీక్షలు రాయగా వారిలో 76 మంది ఉత్తీర్ణత సాధించినట్లు గురుకుల కళాశాల ప్రిన్సిపాల్‌లు తెలిపారు.

త్వరలో అమీన్‌పూర్‌లో నవోదయ స్కూల్

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



ఎమ్మెల్యేకు ప్లానింగ్ చూపుతున్న అధికారులు

పటాన్‌చెరు: పటాన్‌చెరు నియోజకవర్గంలోని పేద, మధ్యతరగతి విద్యార్థులకు నవోదయ విద్యాలయం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ గోశాల సమీపంలోని ప్రభుత్వ సర్వే నంబర్ 993 లో విద్యాసంస్థల ఏర్పాటు కోసం స్థానిక అధికారులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులతో కలసి ఎమ్మెల్యే మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నవోదయ విద్యాలయం కోసం 20 ఎకరాలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కోసం 20 ఎకరాలు, మినీ స్టేడియం కోసం 5 ఎకరాలు కేటాయించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపనున్నామన్నారు. మినీ స్టేడియం పనులను సైతం అతి త్వరలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ వెంకటస్వామి, మాజీ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహగౌడ్, ఆర్ఐ రఘునాథ్‌రెడ్డి, గోపాల్, ఉపేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాలికలదే హవా

- విడుదలైన ఇంటర్మీడియెట్ ఫలితాలు
- ప్రథమశ్రేణిలో 60 శాతం ద్వితీయశ్రేణిలో 68 శాతం ఉత్తీర్ణత
- గతేడాది కంటే తగ్గిన ఉత్తీర్ణత శాతం



సంగారెడ్డి ఎడ్యుకేషన్: ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా ఇంటర్మీడియెట్ ఫలితాలలో బాలికలే పై చేయి సాధించారు. మంగళవారం వెలువడిన ఇంటర్మీడియెట్ ఫలితాలలో బాలికలు సత్తా చాటారు. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో బాలురు 47% ఉత్తీర్ణత సాధించగా, బాలికలు 70% ఉత్తీర్ణత సాధించారు. అదేవిధంగా ద్వితీయ సంవత్సరం ఫలితాలలోను బాలికలదేపై చేయి. బాలురు 57% ఉత్తీర్ణత సాధించగా, బాలికలు 76% ఉత్తీర్ణత సాధించారు. మొత్తంగా ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాలలో గతేడాది 55% ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 18వ స్థానంలో నిలువగా ప్రస్తుతం 60%ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 15వ స్థానంలో నిలిచింది. ద్వితీయ సంవత్సరం ఫలితాలలో గతేడాది 65% ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 15వ స్థానంలో నిలవగా ఈ ఏడాది 68% ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 16వ స్థానంలో నిలిచింది.

ప్రథమ సంవత్సరంలో...

ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో 15,920 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 9,644 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వీరిలో బాలుర విభాగంలో 6,573 మంది విద్యార్థులకు గాను 3,087 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికల విభాగంలో 9,387 మంది విద్యార్థులకు గాను 6,557 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరం ఫలితాలలో బాలుర ఉత్తీర్ణత 46% నమోదు కాగా, బాలికల ఉత్తీర్ణత 69.85%గా నమోదయింది.

ద్వితీయ సంవత్సరం ఫలితాలలో :

ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరంలో 14,259 మంది విద్యార్థులకు గాను 9,817 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బాలుర విభాగంలో 5,764 మంది విద్యార్థులకు గాను 3,301 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వీరి ఉత్తీర్ణత 57.27% గా నమోదైంది. బాలికల విభాగంలో 8,495 మంది విద్యార్థులకు గాను 6,516 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు వీరి ఉత్తీర్ణత 76.70% గా నమోదయింది.

ప్రభుత్వ కళాశాలల్లో...

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో 3,083 మంది విద్యార్థులకు గాను 904 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వీరి ఉత్తీర్ణత శాతం 29.32%గా నమోదైంది. ప్రథమ సంవత్సరం ఫలితాలకు సంబంధించి కల్హేర్ జూనియర్ కళాశాల 59.65 ఉత్తీర్ణతతో ప్రథమ స్థానంలో నిలువగా, కొండాపూర్ జూనియర్ కళాశాలలో జీరో ఉత్తీర్ణత శాతంతో చివరి స్థానంలో నిలిచింది. అదేవిధంగా ద్వితీయ సంవత్సరం ఫలితాలలో 3,072 మంది విద్యార్థులకు గాను 1,411 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా వీరి ఉత్తీర్ణత 45.93%గా నమోదైంది. ద్వితీయ సంవత్సరం ఫలితాలలోను కల్హేర్ జూనియర్ కళాశాల 84.51% ఉత్తీర్ణత సాధించి ప్రథమ స్థానంలో నిలవగా, కొండాపూర్ జూనియర్ కళాశాల కేవలం 12% ఉత్తీర్ణత సాధించి చివరి స్థానంలో నిలిచింది. కస్తూర్బా జూనియర్ కళాశాలలోనూ ప్రథమ సంవత్సరం ఫలితాలలో కేజీబీవీ 90% ఉత్తీర్ణత సాధించి ప్రథమ స్థానంలో నిలవగా, ద్వితీయ సంవత్సరం ఫలితాలలో పుల్కల్ కేజీబీవీ 98% ఉత్తీర్ణతతో ప్రథమ స్థానంలో నిలిచింది.

ఒకేషనల్ విభాగంలో...

ఒకేషనల్ విభాగంలో ఫస్టియర్‌కు సంబంధించి 1,958 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 1,143 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బాలుర విభాగంలో 812 మంది విద్యార్థులు గాను 329 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా, బాలికల విభాగంలో 1,146 మంది విద్యార్థులకు 814 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ విభాగంలో 1,468 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 1,075 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బాలుర విభాగంలో 578మంది విద్యార్థులకుగాను 332 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా బాలికల విభాగంలో 890 మంది విద్యార్థులకు గాను 743 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మహాత్మ జ్యోతిరావు బాపులే కళాశాల విద్యార్థి ప్రసన్న ఎంపీసీ విభాగంలో 994 మార్కులు సాధించి జిల్లాలో ప్రథమస్థానంలో నిలిచింది.



ప్రసన్న (994)

ఐటీసెల్ సేవలు కీలకం: ఎస్పీ



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ పరితోశ్ పంకజ్

సంగారెడ్డి జోన్: సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్న ఈ రోజుల్లో పోలీసు శాఖ మరింత మెరుగ్గా పనిచేయడానికి ఐటీ సిబ్బంది సేవలు కీలకం అని జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్ పేర్కొన్నారు. జిల్లా ఐటీ ల్యాబ్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఐటీ సెల్ సిబ్బంది నిర్వహించే విధులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషన్‌లలో ఎలాంటి సాంకేతిక సమస్య తలెత్తిన క్షణాలలోనే పరిష్కరించే విధంగా నిపుణతను కలిగి ఉండాలన్నారు. మిస్సింగ్, కిడ్నాప్ కేసులలో లొకేషన్స్ ఆధారంగా కేసులను పరిష్కరించేందుకు కీలకపాత్ర పోషించాలన్నారు. సైబర్ నేరాలలో బాధితులు కోల్పోయిన డబ్బులను హోల్డ్ చేయటం, తిరిగి బాధితులకు అందించడంలో ఐటీ సెల్ సిబ్బంది సేవలు మరువలేనివని చెప్పారు. కార్యక్రమంలో ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, ఐటీ సిబ్బంది ఉన్నారు.

మత్స్యకారుల సంఘం అభివృద్ధికి కృషి

సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింలు



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింలు

హత్నూర(సంగారెడ్డి): మత్స్య సహకార సంఘాల అభివృద్ధి కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గున్నాల నర్సింలు పేర్కొన్నారు. మండల కేంద్రమైన రైతు వేదికలో మంగళవారం హత్నూర మత్స్యసహకార సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింలు మాట్లాడుతూ... ప్రభుత్వం నుంచి మత్స్యకారులు రుణాలు పొందాలంటే ముందుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం రిజిస్టర్లు వినయ్ కుమార్, శ్రీనివాసులు స్థానిక మత్స్యకారులు ఉన్నారు.



నిర్మానుష్యంగా మారిన ముంబై జాతీయ రహదారి

నిప్పుల కుంపటి

44 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

- నిర్మానుష్యంగా మారుతున్న రహదారులు
- జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న అధికారులు

సంగారెడ్డిజోన్: జిల్లాలో ఉష్ణోగ్రతలు దంచి కొడుతున్నాయి. రోజురోజుకి ఎండలు విపరీతంగా పెరుగుతున్నాయి. జిల్లాలో చాలాచోట్ల 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు దాటి 45డిగ్రీల చేరువలో నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉదయం 8గంటల నుంచే ఎండ తీవ్రత కనిపిస్తోంది. ఉదయం ఏడు గంటల నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ప్రజలు ఇండ్లలో భరించలేని ఉక్కబోతతో బయట భరించలేని ఎండతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. మధ్యాహ్నం సమయంలో విద్యుత్తు సరఫరా లేని సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నిర్మానుష్యంగా రహదారులు

జిల్లాలో ఎప్పుడు రద్దీగా ఉండే ప్రాంతాలతో పాటు రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే ఎండలు దంచి కొట్టడంతో ప్రజలు ఇండ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావటం లేదు.

జాగ్రత్తలు తప్పనిసరి

- రోజురోజుకి ఎండలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.
- శరీరంలో నీటి శాతం తగ్గకుండా ఎక్కువగా నీరు, పండ్ల రసాలు, కొబ్బరి నీరు తీసుకోవాలి.
- పనులు చేసేవారు ఉదయం, సాయంత్రం సమయాల్లో పనులు చేయాలి.
- ముఖ్యంగా చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు మధ్యాహ్న సమయంలో ఇంటి నుంచి బయటకు రాకపోవటం మంచిది. ఒకవేళ బయటకు వచ్చినా గొడుగుతో పాటు టోపీ ధరించాలి.

రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

జిల్లాలో ప్రతీ రోజు ఉష్ణోగ్రతల్లో మార్పులు వస్తున్నాయి. ప్రతీ రోజు పెరుగుతూనే ఉంది. ఆదివారం జిల్లాలో సుమారు అంతటా 40డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలో అత్యధికంగా నిజాంపేట మండల కేంద్రంలో 44.0డిగ్రీలు, అత్యల్పంగా అందోల్ మండల పరిధిలోని అన్నాసాగర్‌లో 39.3 గా నమోదు అయ్యింది. మే నెలల్లో ఏ విధంగా ఉంటుందో తలుచుకుంటేనే ప్రజలు భయందోళనకు గురి అవుతున్నారు.

ఇళ్ల నుంచి బయటకు రావొద్దు



ఎండలు అధికంగా ఉండటంతో అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రావద్దు. వడదెబ్బ తగులకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఏదైనా ఇబ్బంది ఉంటే ప్రభుత్వ ఆసుపత్రులను సంప్రదించాలి. ఉదయం, సాయంత్రం సమయాల్లో పనులు చేసుకోవాలి. వెచ్చటి పదార్థాలకు దూరంగా ఉండాలి.

-డా.గాయత్రీదేవి, జిల్లా వైద్యాధికారి, సంగారెడ్డి

రైతులకు భూమి గుండెకాయ

- భూ భారతిలో రెవెన్యూ కోర్టుల పునరుద్ధరణ
- అవగాహన సదస్సులో కలెక్టర్ క్రాంతి



తడ్కల్‌లో భూభారతి అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరి క్రాంతి

కంగ్టి(నారాయణఖేడ్)/జహీరాబాద్ టౌన్: రైతులకు భూమి గుండెకాయ లాంటిదని.. భూ సమస్యలు వస్తే తట్టుకోవడం కష్టమని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. కంగ్టి మండలం తడ్కల్‌లోని దేవి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన భూభారతి చట్టం-2025 అవగాహన సదస్సులో ఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ మాధురిలతో కలిసి ఆమె పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ఈ నూతన చట్టంతో రైతులకు గట్ల పంచాయతీ లేని జిల్లాగా మార్చాలన్నారు. భూ సమస్యలు సైతం త్వరితగతిన పరిష్కారమవుతాయని తెలిపారు. ధరణి పోర్టల్‌తో రైతులు పడుతున్న ఇబ్బందులు గుర్తించిన ప్రభుత్వం రెవెన్యూ కోర్టులు పునరుద్ధరించిందని వెల్లడించారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభించండి

ఇందిరమ్మ పథకం కింద ఇండ్లు మంజూరు అయి ఇంకా పనులు ప్రారంభించని లబ్ధిదారులు సత్వరం ముగ్గులు పోసి పనులు ప్రారంభించాలని కలెక్టర్ క్రాంతి సూచించారు. అంతకుముందు మొగుడంపల్లి మండలంలోని చున్నంబట్టి తండా, నందునాయక్ తండాలో జిల్లా కలెక్టర్ వల్లూర్ క్రాంతి బోర్లు తవ్వించారు.

బ్యాంకు గ్యారంటీలకు ససేమిరా

- బీజీలు ఇవ్వని మూడింట రెండోవంతు రైసు మిల్లర్లు
- 94 మిల్లులకుగాను ఇచ్చింది కేవలం 33 మిల్లులే
- వారికే సీఎంఆర్ ధాన్యం కేటాయిస్తామంటున్న అధికారులు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: కస్టం మిల్లింగ్ పేరుతో సర్కారు ధాన్యాన్ని తీసుకుని బహిరంగ మార్కెట్‌లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్న రైసుమిల్లర్లకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం కొత్తగా తెరపైకి తెచ్చిన నిబంధనలు మెదక్ జిల్లాలో అమలు కావడం లేదు. బ్యాంకు గ్యారంటీ (బీజీ)లు ఇస్తేనే కస్టం మిల్లింగ్ కోసం ధాన్యం కేటాయించాలనే నిబంధనను మిల్లర్లు పట్టించుకోవడం లేదు. ఈ యాసంగి కొనుగోలు సీజనులో మిల్లర్లు తీసుకునే ధాన్యానికి బీజీలు ఇచ్చేందుకు ససేమిరా అంటున్నారు. మూడింట రెండోవంతు మిల్లర్లు ఈ బీజీలు ఇవ్వలేదు. జిల్లాలో మొత్తం 94 రైసుమిల్లులు ఉండగా, ఇప్పటివరకు కేవలం 33 రైసుమిల్లుల యాజమాన్యాలు మాత్రమే బ్యాంకు గ్యారంటీలు ఇచ్చాయి. మిగిలిన 61 మిల్లర్లు బీజీలు ఇవ్వాలనే నిబంధనను పెడచెవిన పెడుతున్నారు. దీంతో వీరికి ఈ సీజనులో ధాన్యం కేటాయింపులు ఉంటాయా? లేదా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వం తెచ్చిన కొత్త నిబంధనల ప్రకారం మిల్లర్లు తాము తీసుకునే ధాన్యానికి సంబంధించి బ్యాంకుల నుంచి గ్యారంటీ ఇవ్వాలి. ఒకవేళ తీసుకున్న ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌లో విక్రయించి సొమ్ము చేసుకుంటే ఆ మొత్తాన్ని బ్యాంకు ద్వారా ప్రభుత్వం రాబట్టుకుంటుంది. ఈ నిబంధన జిల్లాలో పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు.

ఊపందుకుంటున్న సేకరణ సీజన్

మెదక్ జిల్లాలో ధాన్యం సేకరణ సీజను ప్రారంభమైంది. ఈ యాసంగి సీజనులో 2.46 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. ఇందులో 2.01 లక్షల ఎకరాల్లో దొడ్డురకం, సుమారు 43 వేల ఎకరాల్లో సన్నరకం ధాన్యం సాగైనట్లు వ్యవసాయశాఖ అధికారులు లెక్కించారు. రైతులు తమ సొంత అవసరాలు పోగా, ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేసే ధాన్యం మినహాయిస్తే...సుమారు 3.89 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం (సన్న, దొడ్డురకాలు కలిపి) ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఈ ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా 480 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయితే ఇప్పటికే ఈ కేంద్రాల్లో సేకరణ షురువైంది. ఈ నెల 19 నాటికి 312 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. ఇలా ఈ సేకరణ ప్రక్రియ ఊపందుకుంటోంది. కానీ, మిల్లర్లు మాత్రం బ్యాంకు గ్యారంటీలు ఇవ్వడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు.

రాజకీయ ఒత్తిళ్లకు..

బ్యాంకు గ్యారంటీలు ఇచ్చిన మిల్లర్లకు మాత్రమే ఈ సీజనులో సీఎంఆర్ ధాన్యం కేటాయింపులు ఇస్తామని అధికారులు పేర్కొంటున్నారు. బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వని మిల్లర్లకు ధాన్యం కేటాయించేది లేదని చెబుతున్నారు. కానీ, రాజకీయ ఒత్తిళ్లు వస్తే...సర్కారు ధాన్యాన్ని మిల్లర్లకు కట్టబెట్టడం అధికారులకు పరిపాటిగా మారింది. గత ప్రభుత్వ హయాంలోనూ ప్రజాప్రతినిధులు, నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు అక్రమార్కులకు అక్షరాల రూ.214 కోట్లు విలువ చేసే ధాన్యాన్ని కట్టబెట్టారు. ఈ మిల్లర్లు సర్కారు ధాన్యాన్ని బహిరంగమార్కెట్‌లో విక్రయించి ఆ సొమ్ముతో రియల్ ఎస్టేట్, ఇతర వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టుకుని రూ.కోట్లకు పడగలెత్తారు. జిల్లా ఉన్నతాధికారులు కూడా తమకు అందే మామూళ్లను తీసుకుని సర్కారు ధాన్యాన్ని అప్పనంగా అక్రమ మిల్లర్లకు అప్పగించారనేది బహిరంగ రహస్యమే. ఈ యాసంగి సీజనులోనైనా ప్రభుత్వం పెట్టిన బ్యాంకు గ్యారంటీల నిబంధనను అధికారులు నిక్కచ్చిగా అమలు చేస్తారా... లేదంటే అక్రమ మిల్లర్లు ఇచ్చే ముడుపులు తీసుకుని బ్యాంకు గ్యారంటీలు లేకుండా సర్కారు ధాన్యాన్ని కేటాయిస్తారా..? అనేది వేచి చూడాల్సిందే. సాధారణంగా రైతుల సమస్యను సాకుగా చూపి ఏటా బ్యాంకు గ్యారంటీలు ఇవ్వని మిల్లర్లకు రూ.కోట్లు విలువ చేసే ధాన్యాన్ని కట్టబెట్టడం పరిపాటైపోయింది.

బీజీలు ఇచ్చిన వారికే కేటాయింపులు

ఈ బ్యాంకు గ్యారంటీల విషయమై 'సాక్షి' జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి సురేశ్‌రెడ్డిని ఫోన్లో సంప్రదించగా ఆయన స్పందించలేదు. అదనపు కలెక్టర్ మెంచు నగేశ్‌ను సంప్రదించగా.. బ్యాంకు గ్యారంటీలు ఇచ్చిన వారికే ధాన్యం కేటాయింపులు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ గ్యారంటీలు ఇవ్వని వారి వద్ద కూడా తీసుకుంటామని పేర్కొన్నారు.

-మెంచు నగేశ్, అదనపు కలెక్టర్, మెదక్

కొత్త టీచర్లకు జీతాలేవి..?

- 2008 డీఎస్సీ అర్హులకు అందని వేతనాలు
- రెండు నెలలుగా ఎదురుచూపులు
- రెగ్యులర్‌గా గుర్తించాలని వేడుకోలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఎన్నో ఏళ్లుగా అలుపెరగని పోరాటం చేసి ఆశతో ప్రభుత్వ ఉద్యోగం సాధించిన ఉపాధ్యాయులకు కొత్త సమస్య వచ్చి పడింది. ఉద్యోగం వచ్చిందన్న సంతోషమే గాని వేతనాలు, ఎంప్లాయి ఐడీ ఇప్పటివరకు వారికి అందలేదు. జిల్లాలో 67 మంది 2008 డీఎస్సీ అభ్యర్థులు రెండు నెలల క్రితం ఉద్యోగంలో చేరారు. పలు సాంకేతిక కారణాల వల్ల వేతనాలు అందించడంలో జాప్యం జరిగి ఉండవచ్చని సంబంధిత వర్గాలు అంటున్నాయి.

డీఎస్సీ 2008 అభ్యర్థులకు అవకాశం...

జిల్లాలో డీఎస్సీ 2008 అభ్యర్థులు 17 ఏళ్లుగా న్యాయ పోరాటం చేస్తూ చివరకు తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు ఈ ఏడాది ఫిబ్రవరిలో జిల్లాలో 67మందికి కాంట్రాక్టు ఎస్జీటీలుగా పోస్టింగ్ ఇచ్చారు. దీంతో వారు ఎస్జీటీలుగా పాఠశాలలో చేరి విధులు నిర్వహిస్తూ విద్యార్థులకు విద్యా బోధన చేస్తున్నారు. నెలకు రూ.31,040 వేతనంగా ఖరారు చేసింది. ఫిబ్రవరిలో వీరికి పోస్టింగ్ ఇచ్చారు. మార్చి 1న వేతనం అందలేదు. ఏప్రిల్ 1న కూడా ఇవ్వలేదు. ఇప్పుడు మే1న వేతనం అందడం కష్టంగానే కనిపిస్తోంది. ఇటీవల వేతనాలు చెల్లించాలని కోరుతూ డీఈవోకు సైతం ఉద్యోగులు వినతి పత్రాన్ని అందజేశారు. జీతాల డ్రాయింగ్ ఆఫీసర్ ఎవరో స్పష్టత లేదు. ఉద్యోగం కోసం ఏండ్లకేండ్లు నిరీక్షించినట్టే, ఇప్పుడు వేతనాల కోసం మళ్లీ నెలల తరబడి నిరీక్షించాల్సి రావడంపై వారంతా కుమిలిపోతున్నారు. కొందరు బస్సు చార్జీలకు డబ్బుల్లేక ఇబ్బందులు పడుతున్నారు. వీరి నియామక సమయంలో ప్రతీ ఏడాది ఏప్రిల్ 23న తొలగించి, మళ్లీ జూన్ 12న తిరిగి కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగంలోకి తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ ఏప్రిల్ 23న వీరిని ఉద్యోగాల నుంచి తొలగించాల్సి ఉన్నది. దీంతో వీరంతా నిరుద్యోగులైపోనున్నారు.



వేతనాలు చెల్లించాలని కోరుతూ డీఈవోకు వినతి పత్రాన్ని అందజేస్తున్న కాంట్రాక్ట్ ఎస్జీటీలు(ఫైల్)

ఉద్యోగ భద్రత లేదు



మాకు ఉద్యోగ భద్రత లేదు. కనీసం ఉద్యోగ గుర్తింపు కార్డులు ఇవ్వలేదు. ఉద్యోగం చేస్తూ రెండు నెలలు గడిచినా జీతాలు ఇవ్వలేదు. ప్రభుత్వం మా ఉద్యోగాలను రెగ్యులర్ చేసి మా కుటుంబాలను ఆదుకోవాలి. ఉపాధ్యాయ యూనియన్లు కూడా మాకు సహకరించాలని కోరుతున్నాం.

-నిరంజన్,చీలపల్లి,కాంట్రాక్ట్ ఎస్జీటీ

ఎంప్లాయ్ ఐడీ, జీతాలు ఇవ్వలేదు



డీఎస్సీ 2008లో భాగంగా 17 ఏళ్ల తర్వాత కోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం మాకు కాంట్రాక్ట్ ఎస్జీటీలుగా నియమించింది. 17 ఫిబ్రవరి 2025న ఉద్యోగంలోకి తీసుకోవడం జరిగింది. మేము ఇప్పటికే చాలా నష్టపోవడం జరిగింది. ప్రభుత్వ టీచర్లుగా గుర్తించి న్యాయం చేయాలని వేడుకుంటున్నాం.

-రాజు, జమ్గర్ బౌలి తండా,కాంట్రాక్ట్ ఎస్జీటీ

త్వరలోనే చెల్లిస్తాం

కాంట్రాక్ట్ ఎస్జీటీలకు త్వరలోనే వేతనాలు వచ్చే అవకాశం ఉంది. ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ అండ్ ఇన్ఫర్మేషన్(ఐఎఫ్ఎంఐఎస్)ట్రెజరీ వ్యవస్థలో సాంకేతిక కారణంతో కొంత జాప్యం జరుగుతుంది. ఎంప్లాయ్ ఐడీ క్రియేట్‌తో త్వరలోనే వారి సమస్య పరిష్కారం అవుతుంది. జీతాల డ్రాయింగ్ ఆఫీసర్‌గా వారికి సంబంధిత కాంప్లెక్స్ హెచ్‌ఎంలు వ్యవహరిస్తారు.

- వెంకటేశం, జిల్లా సెక్టోరియల్ అధికారి

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సులో చోరీ కలకలం

తులం బంగారు గొలుసు పోగొట్టుకున్న వృద్ధురాలు

జహీరాబాద్: జహీరాబాద్ నుంచి రాయికోడ్ మంలంలోని పీపడ్‌పల్లి గ్రామానికి వెళ్తున్న ఆర్టీసీ బస్సులో బంగారం చోరీ కలకలం రేగింది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. మంగళవారం మధ్యాహ్నం జహీరాబాద్ డిపో నుంచి బయలు దేరిన బస్సు పట్టణం దాటకముందే వృద్ధురాలు తన మెడలోని బంగారం గొలుసు చోరీ అయినట్లు తోటి ప్రయాణికులకు చెప్పింది. తన పక్కనే ఉన్న మహిళనే దొంగిలించి ఉండొచ్చని అభియోగం మోపింది. సదరు మహిళ రోదిస్తూ తాను చోరీ ఎందుకు చేస్తానని వాపోయింది. అంతకు ముందే ఇద్దరు యువకులు మార్గ మధ్యలో పట్టణంలోని సిద్ధి హోటల్ వద్ద బస్సు దిగిపోయినట్లు ప్రయాణికులు పేర్కొన్నారు. వారే చోరీకి పాల్పడి ఉండొచ్చనే అనుమానం వ్యక్తం చేశారు. బాధితురాలు తాను రాయికోడ్ మండలంలోని మహ్మదాపూర్ వెళ్తున్నట్లు, తన మేరు మంగళ పేర్కొంది. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాల్సిందిగా సూచించినా తనకు పోలీసు స్టేషన్ తెలియదని, ఇంటికి వెళ్లాక కుటుంబ సభ్యులకు చెబుతానని అదే బస్సులో వెళ్లిపోయినట్లు తోటి ప్రయాణికులు పేర్కొన్నారు.

పీఏసీఎస్ సిబ్బందిపై పెట్రోల్ దాడి

నంగునూరు(సిద్దిపేట): వడ్ల కొనుగోలు విషయమై పీఏసీఎస్ సిబ్బందిపై పెట్రోలు పోసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు రాజగోపాల్‌పేట ఎస్‌ఐ అసీఫ్ తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. తిమ్మాయిపల్లికి చెందిన చల్లారం జగన్మోహన్ రెడ్డి గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి వడ్లు తెచ్చాడు. నాణ్యత పరీక్షించిన సెంటర్ ఇన్‌చార్జి లక్ష్మణ్ సన్న రకం వడ్లని బీ గ్రేడ్ వడ్లుగా తేల్చిచెప్పడంతో జగన్మోహన్‌రెడ్డి గొడవకు దిగాడు. ఈ క్రమంలో పాలమాకుల పీఏసీఎస్ సిబ్బంది అనగోని యాదగిరి మంగళవారం కేంద్రాన్ని సందర్శించి వడ్లను పరీక్షించాడు. అక్కడికి చేరుకున్న జగన్మోహన్‌రెడ్డి బూతులు తిడుతూ యాదగిరిపై పెట్రోలు పోసి నిప్పంటించేందుకు ప్రయత్నించగా హమాలీలు అడ్డుకున్నారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

వడ్ల కుప్పను ఢీకొని..

ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలు

కొండపాక(గజ్వేల్): రోడ్డుపై పోసిన వడ్ల కుప్పలను ఢీకొట్టి ద్విచక్ర వాహనదారుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ ఘటన కొండపాక మండలంలోని మర్పడ్గ గ్రామ శివారులో రైస్ మిల్లు వద్ద మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సిర్సనగండ్ల గ్రామానికి చెందిన పుల్ల బాబు ద్విచక్ర వాహనంపై సిద్దిపేటకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో బీటీ రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కుప్పను ఢీకొట్టాడు. కిందపడటంతో తీవ్ర గాయాలై ఎడమ కాలు విరిగింది. సమాచారం తెలుసుకున్న 108 అంబులెన్సు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఉరేసుకొని మేస్త్రీ ఆత్మహత్య

సంగారెడ్డి: ఉరేసుకొని మేస్త్రీ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చౌట్కూర్ మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ క్రాంతి కుమార్ కథనం మేరకు.. ఉన్నాపూర్ గ్రామానికి చెందిన వడ్డే రాఘవ (33) సోమవారం రాత్రి ఇంట్లోనే నిద్రించాడు. మంగళవారం ఉదయం రాఘవ మామ వెంకయ్య తలుపులు కొట్టి పిలువగా అతడు స్పందించలేదు. లోపల నుంచి ఎటువంటి శబ్దం రాకపోవడంతో తలుపు పగులగొట్టి చూశారు. రాఘవ ఇంటి పైపులకు ఉరేసుకొని కనిపించాడు. నాలుగు నెలల కిందట తన భార్య దుర్గమ్మ చనిపోవడంతో జీవితంపై విరక్తి చెంది మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వెంకయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆటో బోల్తా పలువురికి గాయాలు

దుబ్బాకరూరల్: ఆటో బోల్తా పడి పలువురికి గాయాలైన ఘటన మండలంలోని శిలాజినగర్ గ్రామ శివారులో మంగళవారం చోటు చేసుకుంది. 108 సిబ్బంది కథనం మేరకు.. దుబ్బాకకు చెందిన బట్టు నవీన్, బట్టు కవిత, రాధారం భాను ముగ్గురూ కలిసి ఆటోలో కామారెడ్డి జిల్లా మాచారెడ్డిలో జరిగే సంతలో కూరగాయలు విక్రయించడానికి వెళ్తున్నారు. శిలాజినగర్ శివారులోకి రాగానే ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. ముగ్గురికి గాయాలు కావడంతో చుట్టు ప్రక్కల వారు గమనించి 108కు కాల్ చేశారు. అంబులెన్సులో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

కష్టాల కడలిలో...

విజయ తీరం వైపు..

కూతురు చదువు కోసం ఓ తల్లి ఆరాటం

- ఒంటరిగా బతుకు పోరాటం
- ఒడిదుడుకుల జీవితం.. తీరని దుఃఖం
- ఆర్థిక సాయం కోసం ఎదురుచూపు
- సిద్దిపేట జిల్లా ఆకారానికి చెందిన విజయ కన్నీటి గాథ

ఏడడుగులు తోడుంటానని అగ్ని సాక్షిగా ప్రమాణం చేసిన పతిని విధి దూరం చేసింది. ఇంటి పెద్ద లేకపోవడంతో బాధ్యతలు భుజాన పడ్డాయి. పండుగొస్తే రెండు పూటలా భోజనం.. సాధారణ రోజుల్లో ఒక్క పూట తిండి గగనం.. మరోవైపు ఎదుగుతున్న ఆడపిల్లను చదివించడం ఒక పోరాటం.. ఆర్థిక పరిస్థితి బాగాలేక, అటు కన్నవారు, ఇటు కట్టుకున్న వారు ఆర్థికంగా లేక జానెడు పొట్ట కోసం బతుకు పోరాటం చేస్తున్న విజయ కష్టాల కడలిలో తీరం వైపు కదులుతుంది.. మనసున్న మహారాజులు చేయూత ఇస్తే నా కూతురు చదువుకు సాయం చేసిన వారు అవుతారని కోరారు.

– సిద్దిపేటజోన్

పెద్దపల్లి జిల్లాకు చెందిన విజయకు సిద్దిపేట జిల్లా ఆకారానికి చెందిన నాగరాజుతో 2011లో వివాహం జరిగింది. ఆర్థిక పరిస్థితులు అంతంతే ఉండటంతో నాగరాజు 10 ఏళ్ల క్రితం సిద్దిపేట పట్టణానికి బతుకు దెరువు కోసం వలసొచ్చాడు. స్థానికంగా ఓ ప్రైవేట్ ఏజెన్సీలో చిరు ఉద్యోగం సంపాదించి భార్య బిడ్డను పోషిస్తున్నాడు. సజావుగా సాగుతున్న వీరి జీవితం పై విధి పగ పట్టింది. 2020లో కరోనా వ్యాప్తి ప్రబలుతున్న సమయంలో బ్రెయిన్‌లో రక్తం గడ్డకట్టి అపస్మారక స్థితిలోకి వెళ్లి చనిపోయాడు. అక్కడి నుంచి విజయ కష్టాలు మొదలయ్యాయి కట్టుకున్న భర్త దూరం కావడంతో సిద్దిపేటలో జీవనం కష్టతరంగా మారడంతో మెట్టినిల్లు ఆకారం గ్రామానికి తిరిగి వెళ్లింది. రెండేళ్ల తర్వాత మళ్లీ సిద్దిపేటకు బతుకు దెరువు కోసం వచ్చింది. చదువు అంతంతే ఉండటంతో విజయకు ఉపాధి అవకాశాలు లభించలేదు. పట్టణంలోని పలు చోట్ల కిరాయి ఇంట్లో ఉంటూ కూతురిని చదివిస్తూ బతుకు పోరాటం చేస్తుంది.



పిండి గిర్ని జీవనాధారంగా..

స్థానికంగా ఎన్టీఆర్ నగర్ కాలనీలో రెండు గదుల కిరాయి ఇంట్లో ఉంటున్న విజయ జీవనాధారం పిండి గిర్ని మాత్రమే.. చిన్నపాటి రేకుల షెడ్‌లో గిర్ని పెట్టుకొని బతుకు దెరువు సాగిస్తోంది. సమీపంలో ఉన్న వారు తెచ్చిన వాటిని పిండిగా మార్చి వారిచ్చే కొద్దిపాటి డబ్బులతో బతుకు బండిని నడిపిస్తుంది. నెలవారీ ఖర్చు అధికంగా ఉండడం.. పిండి గిర్ని ద్వారా వచ్చే ఆదాయం అంతంతే కావడంతో ఆర్థిక పరిస్థితి బాగాలేక నిత్యం జీవితంతో పోరాటం చేస్తోంది.

పిండి గిర్ని పడుతున్న విజయ

బిడ్డ చదువు కోసం ఆరాటం



విజయ ఒక్కగానొక్క కూతురు సాత్విక.. ప్రస్తుతం స్థానికంగా ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఏడవ తరగతి చదువుతోంది. కట్టుకున్న భర్త దూరం అయ్యాక.. బిడ్డ భవిష్యత్ కోసం ఆమె పడుతున్న తపన వర్ణనాతీతం. ఎన్ని కష్టాలు వచ్చినా సాత్విక చదువుకు ఆటంకం రాకుండా ఉన్నదాంట్లో సర్దుకుపోతుంది. భర్త బతికి ఉన్నప్పుడు రెండో తరగతి వరకు ప్రైవేటు పాఠశాలలో చదివించింది. భర్త దూరం అయ్యాక ప్రైవేటు విద్య ఆర్థికంగా ఇబ్బంది కావడంతో రెండేళ్లు ఆకారం ప్రభుత్వ పాఠశాలలో చేర్పించింది. తిరిగి సిద్దిపేటకు బతుకు దెరువు కోసం వచ్చి పిండి గిర్ని నడుపుతూ బతుకును వెళ్లదీస్తుంది. మొదట్లో చదివిన స్కూల్‌లో సాత్వికను చేర్పించి పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయుల సహకారం, చేయూతతో కూతురు చదువుకు ఆటంకం లేకుండా చదువు సాఫీగా సాగుతుంది..

మోటివేషన్‌లో కంటతడి

ఇటీవల వేలాది మంది విద్యార్థులకు తల్లిదండ్రులు పడుతున్న కష్టాలు.. పిల్లల బాధ్యత గురించి మోటివేషన్ ప్రక్రియ నిర్వహించారు. వారి మోటివేషన్ విన్న సాత్విక తల్లి విజయ తన కోసం పడుతున్న తపన గుర్తుకు తెచ్చుకొని కంట తడి పెట్టింది. ఇదే సభలో ఉన్న ఎమ్మెల్యే హరీశ్ రావు కూడా ఒక్కసారిగా కంటతడి పెట్టిన వైనం వైరల్‌గా మారిన విషయం తెలిసిందే.

బాగా చదువుకోవాలి

అమ్మ నా చదువు కోసం పడుతున్న కష్టం చూస్తే ఏడుపు వస్తుంది. అమ్మ కష్టాలు శాశ్వతంగా తీరాలి అంటే నేను బాగా చదువుకోవాలి. పెద్ద అయ్యాక ప్రొఫెసర్ అవుతా.. కానీ ఇప్పుడు చదివేందుకు మా అమ్మ వద్ద డబ్బులు లేవు అంటూ అమాయకంగా తమ ఆర్థిక పరిస్థితి గురించి చెప్పింది సాత్విక.

కూతురు కోసమే..

భర్త దూరం అయ్యాడు... పుట్టినిల్లు. మెట్టినల్లు వారు ఆర్థికంగా లేరు. ఒక్కగానొక్క కూతురు చదువు కోసం కష్టపడాలి. తప్పదు. గిర్ని మీద వచ్చేది అంతంత మాత్రమే. రెక్కాడితే కానీ ఇల్లు, పిల్ల చదువు నడిచే పరిస్థితి. సాత్విక చాలా చురుకుగా ఉంటుంది చదువులో రాణిస్తుంది. కానీ ఆర్థిక పరిస్థితి బాగాలేదు.

– బోయ విజయ

అల్లుకున్న 'నిర్లక్ష్యం'



సంగారెడ్డిలో ఇటీవల కురిసిన వర్షాలకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గర పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. కరెంట్ స్తంభాలకు మొక్కలు తీగలా అల్లుకున్నాయి. ఇలాగే వదిలేస్తే మొక్కలు తినడానికి వచ్చిన పశువులు విద్యుత్ తగిలి చనిపోయే అవకాశం ఉంది. మనుషులు సైతం అజాగ్రత్తగా ఉంటే ప్రమాదాల బారిన పడుతారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గర పిచ్చి మొక్కలు తొలగించి, స్తంభాలకు ఉన్న అల్లికలు, తీగలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

పాఠశాల 'శిథిలం'



మండలంలోని తిగుల్ నర్సాపూర్ ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. ఇక్కడ 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 29 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. రెండు భవనాలు ఉన్నా దశాబ్దాల కిందట నిర్మించిన ఒక భవనం పూర్తిగా శిథిలమైంది. ప్రమాదం అంచున ఉపాధ్యాయురాలు విద్యార్థులకు పాఠాలు చెబుతుంది. అమ్మ ఆదర్శ కింద పాఠశాలలో నీటి సంపు, నల్లాల మరమ్మతు పనులు మాత్రమే నిర్మించారు. భవనాల కోసం మాత్రం నిధులు మంజూరు కాలేదు. పాఠశాల పరిస్థితిని జిల్లాస్థాయి విద్యాశాఖ అధికారులకు నివేదిక పంపినట్లు ఎంఈఓ మాధవరెడ్డి తెలిపారు.

– జగదేవ్‌పూర్(గజ్వేల్):

అక్రమ సంబంధానికి అడ్డొస్తున్నాడని..

- యువకుడి దారుణ హత్య
- మృతుడు ములుగు జిల్లా వాసి
- వరంగల్‌లో కిడ్నాప్ చేసి జిల్లెలగడ్డలో బావిలో పడేసిన వైనం
- గుర్తు తెలియని మృతదేహం కేసును ఛేదించిన పోలీసులు

హుస్నాబాద్‌రూరల్: జిల్లెలగడ్డ బావిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన మిస్టరీని పోలీసులు ఛేదించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. ములుగు జిల్లా వెంకటాపూర్‌కు చెందిన సాయి ప్రకాశ్ (29) చేయూత స్వచ్ఛంద సంస్థలో పని చేస్తున్నాడు. చిన్నమ్మ ఓ కానిస్టేబుల్‌తో అక్రమ సంబంధను గుర్తించిన సాయి ప్రకాశ్ కానిస్టేబుల్‌పై అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అతడు సస్పెండ్ అయ్యాడు. ఆరు నెలల తర్వాత విధుల్లో చేరిన కానిస్టేబుల్ ప్రియురాలితో కలిసి అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్న సాయి ప్రకాశ్‌ను అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్నారు. కానిస్టేబుల్ ఓ సుఫారీ గ్యాంగ్‌ను మాట్లాడి సాయిని హత్య చేసే పనిని అప్పగించాడు. 15న వెంకటాపూర్ నుంచి సాయి ప్రకాశ్ కారులో బంధువులను హన్మకొండ హాస్పిటల్‌కు తీసుకొచ్చాడు. రాత్రి తిరుగు ప్రయాణంలో ప్రకాశ్ కారును రెండు ఆటోల్లో సుఫారీ గ్యాంగ్ వెంబడించింది. ములుగు రోడ్డులో కిడ్నాప్ చేసి కారులో హసనుపర్తి వద్దనే హత్య చేశారు. సాయి కారులోనే హన్మకొండ జిల్లా సరిహద్దు దాటి హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డలో రాత్రి ఒక వ్యవసాయ బావిలో మృతదేహం పడేసి వెళ్లిపోయారు. 17న సాయంత్రం రైతు తన బావిలో మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి హుస్నాబాద్ ప్రభుత్వం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన పోలీసులు జిల్లెలగడ్డలోని ఇటుక బట్టీల దగ్గర సీసీ కెమెరాలో పుటేజీను పరిశీలించారు. రాత్రి కారు వచ్చి వెళ్లిన దృశ్యాల ఆధారంతో పోలీసులు కేసును ఛేదించారు. కిడ్నాపు చేసి హత్య చేసిన సుఫారీ గ్యాంగ్‌ను హన్మకొండ పోలీసులు అరెస్టు చేసినట్లు హుస్నాబాద్ పోలీసులు పేర్కొన్నారు.



మృతదేహాన్ని ఖననం చేస్తున్న మున్సిపాల్టీ సిబ్బంది

కూతుర్ల మృతికి కారకురాలైన తల్లిపై కేసు నమోదు

తూప్రాన్: కూతుర్ల మృతికి కారకురాలైన తల్లిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివానందం మంగళవారం తెలిపారు. పట్టణ సమీపంలోని హల్దీవాగులో మాసాయిపేటకు చెందిన వడ్డేపల్లి మమత తన ఇద్దరు పిల్లలు పూజిత(7), తేజస్విని(5)ని హల్దీవాగులో తోసి తాను కూడా ఆత్మహత్యాయత్నంకు యత్నించి ప్రాణాలతో బయట పడిన విషయం తెలిసిందే. ఇద్దరు చిన్నారుల మృతికి తల్లి కారణమని ఎస్‌ఐ తెలిపారు. నిందితురాలి మరిది పోచయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ పట్టణంలోని గుల్షన్ క్లబ్‌లో రెంజుకి షాటోకన్ స్పోర్ట్స్ కరాటే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మెదక్ జిల్లా స్థాయి కరాటే బెల్ట్ ఎగ్జామ్‌లో విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు కరాటే మాస్టర్ దినాకర్ తెలిపారు. సుమారు 100 మంది విద్యార్థులు వివిధ మండలాల నుంచి పాల్గొని ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. విద్యార్థులకు రెంజుకి షాటోకన్ స్పోర్ట్స్ కరాటే ఆఫ్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షుడు మాస్టర్ నగేశ్ బెల్టులు ప్రధానం చేశారు. నిత్యన సిరి, ఐశ్వర్య, అక్షర, విశిష్ట రాజ్, సూరజ్, అబ్దుల్లా, అఖిల్, రిషి, స్వరూప్ సింగ్ పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



పాఠశాల వార్షికోత్సవంలో వెంకటయ్య, వేషాధారణలో విద్యార్థులు

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం రాత్రి నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాతూ.. విద్యార్థి దశ నుంచే మంచి క్రమ శిక్షణ అలవర్చుకుంటేనే నిజ జీవితంలో మంచి ఉన్నత స్థానాన్ని దక్కించుకోవచ్చని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి భాస్కర్, ఎంఈఓ అంజాగౌడ్, మాజీ ఉప సర్పంచ్ వడ్ల ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ ఉమారాణి, నాయకులు బాలాగౌడ్, నర్సింహులు, ఎర్త్ ఫౌండేషన్, ప్రతినిధులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహానందిలో మల్లుపల్లి వాసి ఆత్మహత్య

విహారయాత్రకు వెళ్లి ఉరేసుకున్న యువకుడు

మిరుదొడ్డి(దుబ్బాక): మిత్రులతో కలిసి సరదాగా విహార యాత్రకని వెళ్లిన యువకుడు అక్కడ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనతో మిరుదొడ్డి మండలం మల్లుపల్లి గ్రామంలో మంగళవారం విషాదం చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మాల చిన్న బోయ రాజు (36) కేబుల్ టీవీ ఆపరేటర్‌గా పని చేస్తూ భార్య సుమలతతోపాటు, ఆరేళ్లలోపు కుమారుడు, కూతురిని పోషించుకుంటున్నాడు. 17న ఉమ్మడి మండల పరిధిలోని 14 మంది కేబుల్ ఆపరేటర్లందరూ కలిసి విహారయాత్రకు వెళ్లారు. ఇందులో భాగంగా ఆంధ్ర ప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా మహానందిలో మంగళవారం సాయంత్రం దైవ దర్శనం చేసుకున్నారు. అనంతరం టెంపుల్‌కు సమీపంలో ఉన్న వాటర్ ట్యాంక్‌కు రాజు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని సన్నిహితుల ద్వారా తెలిసింది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.



రాజు మృతదేహం

పిడుగుపాటుకు గేదెలు మృతి

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీకి చెందిన రైతు కోర్పతి కృష్ణ రెండు గేదెలు మంగళవారం సాయంత్రం పిడుగుపాటుకు గురై మృతి చెందాయి. దీంతో రైతు కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. సుమారు రూ.2 లక్షల వరకు నష్టం జరిగిందని రైతు వాపోయాడు. వ్యవసాయానికి పాడి సంపద ఉపాధిగా ఉండేదని పిడుగుపాటుతో వాటిని కోల్పోవడం వల్ల విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

ధర్మారంలో మరో గేదె

మిరుదొడ్డి(దుబ్బాక): పిడుగు పాటుకు పాడి గేదె మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ధర్మారంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన గూళ్ల బాగులు రోజు మాదిరిగానే పాడి గేదెను వ్యవసాయ పొలం వద్ద కట్టి వేశాడు. సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన పిడుగు పడటంతో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. పాడి గేదె మృతితో సుమారు రూ.60 వేల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.



పిడుగుపాటుతో మృతి చెందిన గేదెలు

జిన్నారంలో విగ్రహం ధ్వంసం

- ఆందోళనకు దిగిన గ్రామస్తులు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ పరితోశ్ పంకజ్, డీఎస్పీ రవీందర్‌రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండల కేంద్ర సమీపంలోని తాబేలు గుట్టపై ఏర్పాటుచేసిన ఓ విగ్రహాన్ని ఓ వర్గానికి చెందిన విద్యార్థులు ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు విద్యార్థులను ప్రశ్నించగా భయంతో వారుంటున్న హాస్టల్ లోపలికి పరుగులు తీశారు. కాగా, ఈ వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. విగ్రహం ధ్వంసంతో కోపోద్రిక్తులైన గ్రామస్తులు పెద్ద ఎత్తున చేరుకుని హాస్టల్ ముందు ఆందోళనకు దిగారు. ఓ దశలో పరిస్థితి అదుపుతప్పడంతో పోలీసులు రంగప్రవేశం చేసి అడ్డుకున్నారు. ఈలోగా గ్రామస్తులు హాస్టల్ గేటును తోసుకుని లోనికి వెళ్లే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్, పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌డ్డి హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఘటనకు కారణమైన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.



ఘటనా స్థలంలో పోలీసులు

ఇద్దరి ప్రాణం తీసిన ఈత సరదా

- దుబ్బాకలో యువకుడు, కొమురవెల్లిలో వ్యక్తి
- ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం

దుబ్బాకరూరల్: ఈతకు వెళ్లి యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని చీకోడ్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ గంగరాజ్ కథనం మేరకు.. తాడ ఏగొండ, భూదవ్వ దంపతుల ఒక్కగానొక్క కుమారుడు బాబు(25) గ్రామ శివారులో ఉన్న చెరువులోకి స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లాడు. ఈత కొడుతూ చెరువులోకి చాలా దూరం వెళ్లి నీటిలో మునిగి పోయాడు. గమనించిన స్నేహితులు చెరువులో నుంచి బయటకు తీసుకొచ్చి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఏగొండ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. చేతికొచ్చిన కొడుకు చెరువులో మునిగి మృతి చెందడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.

మద్యం మత్తులో వెళ్లి..

కొమురవెల్లి(సిద్దిపేట): మద్యం మత్తులో ఈత కొట్టేందుకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మంగళవారం ఎస్‌ఐ రాజు కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన గొల్లపల్లి కనకయ్య(50) కుటుబంతో కలిసి హైదరాబాద్‌లో పాత ఇనుప సామగ్రి వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల పెద్ద కుమారుడుకి కొడుకు పుట్టడంతో బారసాల నిర్వహించేందుకు గ్రామానికి వచ్చారు. ఆదివారం బారసాల కార్యక్రమాన్ని పూర్తి చేశారు. మంగళవారం కుటుంబంతో కలిసి మద్యం సేవించారు. మధ్యాహ్న సమయంలో స్నానం చేసేందుకు గ్రామ శివారులో గల పెద్ద బావి వద్దకు వెళ్లాడు. నీటికిలోకి దూకిన కనకయ్య ఎంత సేపటికీ బయటకు రాకపోవడంతో కుమారులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి భార్య యాదమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



దుబ్బాకరూరల్: యువకుడి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు



కొమురవెల్లి(సిద్దిపేట): స్థానికుల సాయంతో మృతదేహాన్ని వెలికితీస్తున్న పోలీసులు